ఎట్టకేలకు ప్రారంభమైన తారురోడ్డు పనులు

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలో టెక్కలవలస జాతీయ రహదారి జంక్షన్ నుంచి కాగాం తదితర గ్రామాలకు వెళ్ళే బిటి తారు రోడ్డు పనులపై విశాలాంధ్ర పత్రికలో వచ్చిన కథనాలకు ఎట్టకేలకు అధికారులు స్పందించారు. తారు రోడ్డు పనులు ప్రారంభించారు. త్వరితగతిన రోడ్డు నిర్మాణం పూర్తి అయితే వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులూ ఉండవని జిల్లా స్థాయి అధికారులను, రోడ్డు కాంట్రాక్టుదారులను ఆయా గ్రామాల ప్రజలు కోరుకుతున్నారు.

నేడు డిసిసిబి చైర్మన్‌గా కిమిడి నాగార్జున ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర-విజయనగరం : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా చీపురుపల్లి నియోజకవర్గానికి చెందిన కిమిడి నాగార్జున ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. తెలుగుదేశం పార్టీ విజయనగరం పార్లమెంటరీ పార్టీ అధ్యక్షునిగా ఉన్న నాగార్జునకు డిసిసిబి చైర్మన్ పదవి ఇచ్చి అధిష్టానం గౌరవించింది. చీపురుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే టిక్కెట్ రేసులో ఉన్న నాగార్జున చివరి నిమిషంలో రాజకీయ మార్పుల నేపథ్యంలో తనపెదనాన్నకు టిక్కెట్ ఇవ్వడంతో పూర్తి స్థాయిలో పనిచేసి తన చిత్తశుద్దిని నిరూపించుకున్నారు. పార్టీకి విదేయునిగా ఉన్న నాగార్జునను అధిష్టానం డిసిబి చైర్మన్ పదవితో సత్కరించింది. ఆదివారం ఫూల్‌బాగ్‌లోని జె కన్వన్షన్ హాల్‌లో ప్రమాణ స్వీకార మహెూత్సవానికి డిసిసిబి పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసింది. భారీగా తరలి వచ్చే అభిమానులకు తగిన ఏర్పాట్లు చేసారు.

నేడు డిసిఎంఎస్ చైర్మన్‌గా గొంప కృష్ణ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర-విజయనగరం : జిల్లా కోఆపరేటివ్ మార్కెట్ కమిటీ (డిసిఎంఎస్) చైర్మన్‌గా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంపకృష్ణ నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఎస్‌కోట నియోజకవర్గానికి చెందిన గొంపకృష్ణ ఎస్‌కోట నియోజకవర్గ టీడీపీ టిక్కెట్ కోసం తీవ్ర స్థాయిలో ప్రయత్నించారు. ఎన్ఆర్ఐగా వచ్చిన ఆయన నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. ఒక విదంగా ఎస్‌కోటలో టీడీపీకి మంచి ఊపు తెచ్చారని చెప్పవచ్చు. దాదాపు టిక్కెట్ అతనికే ఖాయమనే దశలో అధిష్టానం కోళ్ళ కుటుంబానికి కేటాయించింది. ఈసమయంలో గొంపకృష్ణకు అధిష్టానం ఇచ్చిన హామీ మేరకు డిసిఎంఎస్ చైర్మన్ పదవిని ఇచ్చింది. ఆదివారం జిల్లా కేంద్రమైన విజయనగరంలో ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈకార్యక్రమానికి ఎస్‌కోట నియోజకవర్గంలోని 5 మండలాలలో ఉన్న ఆయన అభిమానులు, టీడీపీ నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్తున్నారు.

9న నియోజకవర్గ స్థాయిలో విజన్ ప్లాన్ కార్యాలయాలు ప్రారంభం

విశాలాంధ్ర - విజయనగరం: రాష్ట్ర ప్రభుత్వ ఆదే శాల మేరకు అసెంబ్లీ నియోజకవర్గ వారీగా రూపొం దించిన విజన్ ప్లాన్(దార్శనిక పత్రం) అమలుకోసం జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక కార్యాలయాలను జూన్ 9వ తేదీన ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్. అంబేద్కర్ వెల్లడించారు. జిల్లాలోని నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు, ఎంపిడిఓలు, తహశీల్దార్లతో జిల్లా కలెక్టర్ శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నియోజకవర్గ శాసనసభ్యులు అధ్యక్షులుగా, నియోజక వర్గంలోని శాసన మండలి సభ్యులు, మునిసిపల్ చైర్ పర్సన్‌లు, ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్‌లు సభ్యులుగా వుంటారని, నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఉపాధ్యక్షుడుగా, నియోజకవర్గ కేంద్ర ఎంపిడిఓ ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తారని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యాలయాల ద్వారా ఆయా నియోజకవర్గాల విజన్ ప్లాన్ కార్యాచరణ అమలును పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. కార్యాలయ ప్రారంభోత్సవ అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎస్.చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి నేరుగా నియోజకవర్గ విజన్ ప్లాన్ అమలుపై నియమితులైన కమిటీలతో ఆన్ లైన్ ద్వారా ముఖాముఖి నిర్వహిస్తారని చెప్పారు. జూన్ 11న జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకు స్థాపనలు జరిపేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా రూ.105 కోట్ల విలువైన 416 పనులను ప్రారం భించేందుకు, శంకుస్థాపనలు చేసేందుకు గుర్తించా మని చెప్పారు. రాజాంలో 29, బొబ్బిలిలో 31, చీపురుపల్లిలో 151, గజపతి నగరంలో 47, నెల్లిమర్లలో 43, ఎస్.కోటలో 44, విజయనగరంలో 46 చొప్పున పనులను సిద్ధం చేయడం జరిగిందన్నారు. సమావేశంలో సిపిఓ పి.బాలాజీ, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, అన్ని శాఖల జిల్లా అదికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు, తహశీల్దార్‌లు పాల్గొన్నారు.

అమలుకాని సూపర్ సిక్స్ హామీలు

ఎస్.కోట నియోజకవర్గ 18వ సీపీఐ మహాసభల్లో రాష్ట్ర సీపీఐ కంట్రోల్ కమిటీ చైర్మన్ పి.కామేశ్వరరావు

విశాలాంధ్ర - శృంగవరపుకోట: ఎస్.కోట నియోజకవర్గ 18వ సిపిఐ మహాసభలు శనివారం మండల కేంద్రంలో జరిగాయి. స్థానిక సుబ్బిరామరెడ్డి కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర సిపిఐ కంట్రోల్ కమిటీ చైర్మన్ పి. కామేశ్వరరావు హాజరై, పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం సభను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం "సూపర్ సిక్స్" అమలు చేస్తున్నామని ప్రకటించినా, వాస్తవిక పరిస్తితుల్లో అవి ఎక్కడా అమలులో లేవని విమర్శించారు. పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల భూమిపై గృహనిర్మాణానికి రూ.ఐదు లక్షల సాయం అందించే వరకూ మా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సిపిఐ వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీ, కార్మికులు, మహిళలు, యువత, విద్యార్థులు, రైతులు, అట్టడుగు వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన పార్టీ సీపీఐ అని గుర్తు చేశారు. ఎనిమిది గంటల పని సమయం, కనీస వేతనాలు, మహిళలపై దాడుల నివారణకు చట్టాలు, ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం, సమాచార హక్కు చట్టం వంటి అనేక ప్రజానుకూల చట్టాలు సిపిఐ పోరాట పటిమ వల్లే వెలుగులోకి వచ్చాయన్నారు. ప్రస్తుత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ధనికుల కోసమే పని చేస్తున్నాయని పేదలకు పట్టెడన్నంలో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పేదవాడికి ఉండడానికి ఇల్లు ఇస్తూ వారికి విద్య, వైద్యం అందుబాటులోకి తెచ్చిననాడే పేదవాడికోసం ప్రభుత్వాలు పని చేసే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. పహల్గమా సంఘటన అనంతరం ఆపరేషన్ సింధూరు మొదలుపెట్టి అమెరికాకు తలగ్గి కేంద్ర ప్రభుత్వం మధ్యలోనే వదిలేశారని ఎద్దేవా చేశారు. ఈ మహాసభల్లో విజయనగరం జిల్లా సెక్రెటరీ ఒమ్మి రమణ, జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనంద్, నియోజకవర్గ సెక్రెటరీ దేగల అప్పలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు భీముడు, కార్యదర్శి అప్పారావు, అనేక మంది పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సాంబరాజు మృతి టీడీపీకి తీరని లోటు: మంత్రి కొండపల్లి

విశాలాంధ్ర - గుర్ల: అనారోగ్యంతో బాధపడుతూ కొద్దిరోజుల క్రితం మృతి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు సాంబరాజు మృతి గుర్ల మండల టీడీపీకి తీరని లోటని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని కెల్ల గ్రామంలో ఉన్న సాంబరాజు స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఈ ప్రాంత టీడీపీ అభివృద్ధికి, వైభవానికి స్వర్గీయ సాంబరాజు చేసిన సేవలు శ్లాఘనీయం అన్నారు. కాంగ్రెస్ కంచుకోట అయిన సతివాడ నియోజకవర్గంలో టిడిపి జెండా రెపరెపలాండించిన ఘనత సాంబరాజుకు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నేడు బి.ఆర్.అంబేద్కర్ విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని వీలుపర్తి పంచాయతీలోని వెల్దాం గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం నూతనంగా నిర్మించిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం జరుగుతుందని అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు తెలిపారు. వెల్దాం ఎస్సీ కాలనీలో గల రచ్చబండ దగ్గర ఆదివారం ఉదయం 10 గంటలకు చేపట్టబోయే డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహావిష్కరణకు పలువురు ప్రముఖులు, పెద్దలు హాజరై ఆవిష్కరిస్తారన్నారు. అలాగే భారీ సభ ఏర్పాటు చేసి అంబేద్కర్ ఆశయాలను వివరిస్తారన్నారు. అలాగే సభా ప్రాంగణంలో మధ్యాహ్నం 12 గంటల నుండి అన్న సమారాధన ఏర్పాటు చేయడం జరిగిందని జై భీమ్ యూత్ సభ్యులు తెలిపారు.

మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు నిర్వహించాలి

విశాలాంధ్ర - భోగాపురం: ఎస్జీటీ ఉపాధ్యాయులకు మాన్యూవల్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు నిర్వహించాలని మండల విద్య వనరుల కేంద్రం వద్దశనివారం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.ఎస్జీటీ ఉపాధ్యాయులకు మాన్యూవల్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు నిర్వహిస్తమని పాఠశాల విద్యా కార్యదర్శి సమక్షంలో ఇచ్చిన హామీకి భిన్నంగా వెబ్ ఆప్షన్ ద్వారా బదిలీలు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎస్జీటీ ఉపాధ్యాయులు వెబ్ ఆప్షన్ పెట్టకుండా బాయ్ కాట్ చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక సభ్యులు పిలువునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీనివాస జూనియర్ కళాశాల విద్యార్థులు టౌన్ ఫస్ట్

విశాలాంధ్ర - చీపురుపల్లి: శనివారం విడుదలైన ఇంటర్ ఫలితాలలో చీపురువల్లి శ్రీనివాస జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపీసీ, బైపిసి గ్రూప్‌లలో టౌన్ ఫస్ట్ మార్కులు సాధించారు. ఫస్ట్ ఇయర్ ఎంపీసీ విభాగంలో పి.వైష్ణవి (465/470) టౌన్ ఫస్ట్ మార్కులు సాధించింది. అదేవిధంగా ఆర్.రోహిత్ 464 మార్కులతో టౌన్ సెకండ్ ర్యాంకు, అనన్య 461, బైపిసి విభాగంలో కే.రేచల్ జ్యోతి (434/440) సాధించగా బైపిసి విభాగంలో టౌన్ ఫస్ట్ సాధించింది. ఉత్తమ ఫలితాలు కనబరిచిన వీరిని కళాశాల ప్రిన్సిపల్ ఏడీఎంఎస్ వి.ప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు. పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థులను, అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, అధ్యాపకులు అభినందించారు.

ఖాదర్ బాబా సన్నిధిలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: దేవుని పట్ల విధేయతకు చిహ్నంగా.. త్యాగానికి ప్రతీకగా నిలిచిన ఆదిమ ప్రవక్తల పితామహుడు హజరత్ ఇబ్రహీం ఖలీలుల్లా నామాన్ని స్మరించుకుంటూ జరుపుకునే పవిత్ర పర్వదినం 'బక్రీద్'..ఈ పండగను పురస్కరించుకుని విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు శనివారం బాబామెట్టలో గల హుజూర్ హజరత్ ఖాదర్ షా వారి దర్బార్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఖాదర్ బాబా దర్గా, దర్బార్ ధర్మకర్త డాక్టర్ ఎండీ ఖలీలుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ (ఖలీల్ బాబు) దర్బార్ సంప్రదాయం ప్రకారం ఎంపీకి సాదర స్వాగతం పలికారు. ఖాదర్ బాబా వారి శేష వస్త్రాలతో పాటు దుశ్శాలువ కప్పి సత్కరించారు. అనంతరం ఎంపీ దర్బార్‌లో గల ఖాదర్ బాబా వారి సన్నిధిని దర్శించుకుని, బాబాకి పుష్పాలు సమర్పించి విశ్వశాంతికై ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఉపాధ్యాయ బదిలీలలో మాన్యువల్ కౌన్సిలింగ్ జరపాలి

ఉపాధ్యాయ సంఘాల డిమాండ్



విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఉపాధ్యాయ బదిలీలలో మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని కోరుతూ శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నేతలు మాట్లాడుతూ ఎస్జీటీ ఉపాధ్యాయులకు బదిలీలు మాన్యువల్‌గా జరగాలన్నారు. జిల్లాలో గల ఏ ఉపాధ్యాయులకు కూడా వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకోరాదని తీర్మానం చేయడం జరిగిందన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కాకుంటే రాష్ట్ర ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరగబోయే నిరసన కార్యక్రమాల్లో ఉపాధ్యాయులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఐక్యవేదిక నాయకులు కే.జోగారావు, చిప్పాడ సూరిబాబు, ఎస్.శ్రీనివాస్, ఈశ్వరరావు, డి.ఈశ్వరరావు, ఎస్.పైడిరాజు, టి.శ్రీనివాస్, ఎస్.రమణ, డి.రాము, రమేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నోటరీ అడ్వకేట్‌గా కిమిడి రామినాయుడు

విశాలాంధ్ర - రాజాం: రాజాం బార్ అసోసియేషన్‌లో మరో నోటరీ అడ్వకేట్‌గా కిమిడి రామినాయుడు నియమించబడ్డారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బార్ అసోసియేషన్ అధ్యక్షులు మామిడి వేణు నాయుడు, జద్దు అప్పలనాయుడు, రెడ్డి రామ్మూర్తి నాయుడు, సాసుబిల్లి అప్పలనాయుడు, సీహెచ్ పకీరునాయుడు, తదితర న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

కుమిలిలో 20 కుటుంబాలు జనసేనలో చేరిక

విశాలాంధ్ర - పూసపాటిరేగ: నెల్లిమర్ల నియోజకవర్గంలోని కుమిలి గ్రామానికి చెందిన వైసీపీ మాజీ ఎంపీటీసీ నీలాపు రాజారెడ్డి, తన అనుచరులతో పాటు సుమారు 20 కుటుంబాలతో కలిసి జనసేన పార్టీలోకి చేరారు. ఈ కార్యక్రమం ముంజేరు జనసేన పార్టీ కార్యాలయంలో వైభవంగా జరిగింది. జనసేన పార్టీ నాయకులు బొండా వినోద్ కుమార్ గారి సమన్వయంతో, నెల్లిమర్ల శాసనసభ్యురాలు లోకం నాగమాధవి స్వయంగా కండువాలు కప్పి వారికి పార్టీ సభ్యత్వాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లోకం మాధవి మాట్లాడుతూ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్న ప్రభుత్వంగా, ప్రజల సమస్యల పరిష్కారమే మా ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి మహిళా పారిశ్రామికవేత్తలే కీలకం

విశాలాంధ్ర - బొబ్బిలి: జిల్లా అభివృద్ధి చెందాలంటే చదుకున్న మహిళా పారిశ్రామికవేత్తలు కొత్త పరిశ్రమలు పెట్టడానికి ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ అన్నారు. శనివారం బొబ్బిలి గ్రోత్ సెంటర్లో సుధీర్ పాలిమర్స్ పరిశ్రమను ఆయన ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర లో కొత్త తరహాలో పి.ఎమ్.ఈ.జి.పి పథకం ద్వారా ప్లాస్టిక్ గ్రాన్యూల్ పరిశ్రమను ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందని 2024,25 సంవత్సరంలో ఉత్తరాంధ్ర లోనే ఇది మొదటి పరిశ్రమ అని రాష్ట్ర ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానం తో ఉత్సాహంగా ఉండే యువతను ప్రోత్సహిస్తుందని ఆయన అన్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన మాట్లాడుతూ బొబ్బిలి గ్రోత్ సెంటర్లో కొత్త తరహా ప్లాస్టిక్ పరిశ్రమ ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందని బొబ్బిలి గ్రోత్ సెంటర్ లో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించడానికి తగిన చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే జిల్లా అధికారులు తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని అన్నారు. ఈ ప్రారంభోత్సవంలో డి.ఆర్.డి.ఏ.పీడీ కళ్యాణ చక్రవర్తి, లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, పరిశ్రమ నిర్వాహకురాలు ఆళ్ల జ్యోతి, శిరీషలతో పాటుగా ఆర్డీవో బొబ్బిలి, మండల తహశీల్దార్ వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

రూ.20 లక్షలతో రోడ్డు నిర్మాణం

కొవ్వాడ గ్రామానికి 4 వైపులా రోడ్లే... పరుగులు పెడుతున్న అభివృద్ధి పట్టు విడవని విక్రమార్కుడు సర్పంచ్ కోట్ల రఘు

ఒవిశాలాంధ్ర - పూసపాటిరేగ: ఒక సర్పంచ్‌కు ఇంత పట్టుదల కొనియాడదగినదే. పట్టు విడవని విక్రమార్కుడులా ఎన్ని ఇబ్బందులు వచ్చినా వదలకుండా రోడ్డు లేని ఊరికి నాలుగు దిక్కుల నుండి రోడ్లు వేయడమంటే చిన్న విషయం కాదు. తన ఊరి ఉనికిని దశదిశలా వ్యాప్తించి ఆకలి, వలసలు నివారించే విధంగా అభివృద్ధి చెందటం కోసం గ్రామానికి రహదారుల నిర్మాణం ముఖ్యమని భావించి పట్టుదలతో సర్పంచ్ కోట్ల రఘు ఊరికి తూర్పు వైపు రోడ్డు పనులు ప్రతిపాదించారు. దీనితో ఆ గ్రామానికి నాలుగు వైపుల నుంచి రోడ్ల సౌకర్యం కలగనుంది. శుక్రవారం రోడ్డుకి భూమి పూజ చేసి ప్రారంభించారు. కొవ్వాడ శివాలయం నుండి సాయిబాబా టెంపుల్ వరకు ఆర్ అండ్ బి రోడ్డుకు కలుపుతూ 40 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ రోడ్డుకు 20 లక్షల నిధులు ఖర్చవుతున్నట్టుగా సర్పంచ్ తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల తమ గ్రామం నుంచి ఎస్ఎంఎస్ ఫార్మా, హెచ్‌బిఎల్ వంటి కంపెనీలో పనిచేస్తున్న వాళ్లకు అనుకూలంగా ఉంటుందని ఆయన తెలిపారు. కొవ్వాడ గ్రామంలో గల 14వ శతాబ్దానికి చెందిన పురాతన శివాలయాన్ని కందివలస గ్రామ సాయిబాబా దేవాలయం నుండి వచ్చేవారికి ఈ రోడ్డు అనుకూలంగా ఉంటుంది అని భక్తులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో ఘనంగా బక్రీద్

విశాలాంధ్ర - గంట్యాడ: త్యాగానికి నిస్వార్థానికి ప్రత్యేకంగా మహమ్మదీయులు సంవత్సరములో ఒకసారి జరుపుకొనే గొప్ప పండగలలో బక్రీద్ ఒకటి. ఈ సందర్భంగా గంట్యాడ మండలానికి చెందిన ముస్లింలు తమ సంప్రదాయ పరమైన వస్త్రధారణతో ఈద్గా మైదాన ప్రాంతంలో మరియు మసీదులో అల్లాను సుతించారు. దాదాపుగా మండలంలో గల మహమ్మదీయులందరూ పాల్గొన్నారు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు పరస్పరం తెలియజేసుకున్నారు.

ఉపాధ్యాయుల వెబ్ కౌన్సిలింగ్ నిలిపివేయాలి

విశాలాంధ్ర - రామభద్రపురం: ప్రభుత్వం ఉపాధ్యాయులకు వెబ్ కౌన్సిలింగ్ ద్వారా చేపట్టిన బదిలీలను తక్షణమే నిలిపివేయాలని జిల్లా యుటిఎఫ్ సహ అధ్యక్షులు ప్రసన్నకుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎంఆర్‌సి భవనం వద్ద ఉపాధ్యాయ బదిలీలకు వ్యతిరేకంగా ఐక్య సంఘాల ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరసన తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలను మాన్యువల్‌గా చేపట్టాలని డిమాండ్ చేశారు. వెబ్ కౌన్సిలింగ్ ద్వారా గందరగోళం నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వెబ్ కౌన్సిలింగ్ రద్దు చేయాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ద్వారా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యుటిఎఫ్ కార్యదర్శి కేశవరావు, ప్రధాన కార్యదర్శి శంకర్రావు, ఏపీటీఎఫ్ రాంబద్రపురం మండల నాయకులు బొప్పే రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుపేదలకు బాసటగా సీఎం రిలీఫ్ ఫండ్

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు

విశాలాంధ్ర - చీపురుపల్లి: నిరుపేదలకు సిఎం రిలీఫ్ ఫండ్ బాసటగా నిలుస్తుందని టీడీపీ యువనాయకులు, రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ మల్లిక్ నాయుడు అన్నారు. శనివారం చీపురువల్లి టీడీపీ కార్యాలయం నందు నియోజకవర్గానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. వివిధ అనారోగ్య కారణాలతో చికిత్స పొంది ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.4,73,363/- లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యువనేత కిమిడి రామ మల్లిక్ నాయుడు మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి చికిత్స కోసం, అనంతర సహాయం కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు నాయకత్వంలో చీపురుపల్లి శాసన సభ్యులు కిమిడి కళావెంకటరావు ఆదేశాలతో సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు, యువనేత కిమిడి రామ మల్లిక్ నాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు.

రైల్వే జోన్ జీఎంను నియమించడం శుభ పరిణామం

- ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

విశాలాంధ్ర - లక్కవరపుకోట: రైల్వే జోన్‌కు జీఎంను నియమించడం శుభ పరిణామం అని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైల్వే జోన్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వంలో శరవేగంగా పనులు జరుగుతున్నాయని ఆమె అన్నారు. గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం రైల్వే జోన్ నిర్లక్ష్యం చేయడం వల్ల పనులు ఆలస్యం అయ్యాయని జోన్‌కు అవసరమైన 54 ఎకరాలు ప్రభుత్వం కేటాయించకుండా నిర్లక్ష్యం చేసి ఉత్తరాంధ్రాకు తీరని అన్యాయం జరిగిందని అన్నారు. రూ.149 కోట్ల రూపాయల వ్యయంతో 9అంతస్తులతో రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణం కూడా జరుగుతుందన్నారు. గత 12 నెలల కాలంలో రూ.75 వేల కోట్ల నేషనల్ హైవే ప్రాజెక్టులు రూ.72 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి నారా చంద్ర బాబు నాయుడు తీసుకువచ్చి రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షులు చొక్కాకుల మల్లు నాయుడు, జి.ఎస్.నాయుడు, సీనియర్ నాయకులు ఎర్నాయుడు, సర్పంచ్ నవీన్, క్లస్టర్ ఇన్‌చార్జి రత్నాజీ, మాజీ సర్పంచ్ రాయవరపు రవి, డోకుల అచ్చం నాయుడు పాల్గొన్నారు.

ఐ యాప్ ద్వారా అక్రమాలపై పర్యవేక్షణ

ఎక్సైజ్ సీఐ చక్రవర్తి

విశాలాంధ్ర - చీపురుపల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు చీపురుపల్లి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఐ అనే ప్రత్యేక యాప్ ద్వారా మద్యం షాపులలో నిరంతర పర్యవేక్షణ జరుపుతున్నామని చీపురుపల్లి ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సిహెచ్ చక్రవర్తి శనివారం విలేకరులకు తెలిపారు. ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 19 మద్యం దుకాణాలు వ్యాపారాలు కొనసాగిస్తున్నాయని వీటిపైన ప్రత్యేక యాప్ ద్వారా పర్యవేక్షణ జరిపి చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. చట్ట విరుద్ధంగా ఏ ఒక్కరైనా అక్రమ వ్యాపారాలకు పాల్పడితే ప్రత్యేక యాప్ ద్వారా గుర్తించి వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సిఐ హెచ్చరించారు.

అంగరంగ వైభవంగా శ్రీ కృష్ణ విగ్రహ ప్రతిష్ట

హాజరైన డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని చామలాదేవి అగ్రహారం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కృష్ణ ఆలయం విగ్రహ ప్రతిష్ఠ, కలిశ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం శనివారం అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం 7గంటలకు స్వామివారియంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ఠ, శిఖరప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయనగరం జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణతో పాటు టిడిపి శ్రేణులు హాజరై శ్రీకృష్ణ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అలాగే మధ్యాహ్నం 12గంటల నుండి స్వామివారి సన్నిధిలో వీలుపర్తి సర్పంచ్ దంపతులు శానాపతి లీలా అప్పారావు, కోటాన అర్జునరావుల ఆర్థిక సహాయంతో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేయగా వేలాది మంది భక్తులు పాల్గొని శ్రీకృష్ణ స్వామివారి అన్న ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తప్పెటగుళ్ళు, మహిళ కోలాటం సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, టిడిపి నాయకులు మంచిన అప్పలసూరి కోటాన నాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆలయాల ప్రారంభోత్సవంలో వైసీపీ నాయకులు

విశాలాంధ్ర - చీపురుపల్లి: నూతనంగా ప్రారంభోత్సవాలు జరుపుకున్న ఆలయాలను శనివారం చీపురుపల్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.. విజయనగరం జిల్లా, గరివిడి మండలం, రేగటి రాజాం మండలం, గార్రాజు చీపురుపల్లి గ్రామంలో ప్రజలందరు సహాయ సహకారంతో నూతనంగా నిర్మించిన శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి దేవాలయం ప్రారంభోత్సవం పంచరాత్ర ఆగమ శాస్త్రానుసారం శనివారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు పాల్గొన్న చీపురుపల్లి జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మరియు ఎంపీపీ ప్రతినిధి ఇప్పిలి అనంతం, చీపురుపల్లి మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మీసాల వరహాలనాయుడు, కర్లాం గ్రామ సర్పంచ్ బాణాల శ్రీను భాగ్యలక్ష్మి దంపతులు, కర్లాం ఎంపీటీసీ బాణాల రమణ రామరత్నం దంపతులు, గవిడి సురేష్, ప్రభాత్ కుమార్ ప్రత్యేక పూజలు చేశారు మారేడు పాక నారాయణమూర్తి, మౌలేశ్వర రావు నేతృత్వంలో పూర్ణాహుతి శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు గ్రామ పెద్దలు గ్రామస్తులు సహకారంతో భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గరివిడి, రాజాం మండల వైస్సార్ సివి నాయకులు, ఆ గ్రామ నాయకులు, పెద్దలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పరుగు ప్రదర్శన

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని చామలాదేవి అగ్రహారం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ ఆలయం ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ఎడ్ల పరుగు ప్రదర్శన ఉల్లాసంగా సాగింది. ఈ ఎడ్ల పరుగు ప్రదర్శనలో 11 జతల ఎడ్ల బండ్లు పాల్గొని ఎడ్ల పరుగు ప్రదర్శన ప్రదర్శింపగా గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి బహుమతి రూ.20వేలు వీలుపర్తి సర్పంచ్ సేనాపతి లీలా అప్పారావుల ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేయగా శ్రీ మరిడిమాంబ వావిలపాడు ఎడ్ల యజమాని వారికి. అలాగే 2వ బహుమతి రూ.15వేలు వేపాడ మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు గొంప వెంకట్రావు ఆర్థిక సహాయంతో బోడి నాగ తేజ ముద్దుర్తి వారికి,3వ బహుమతి రూ.10వేలు కోటాన అర్జున రావు మాజీ ఉపసర్పంచ్ ఆర్థిక సహాయంతో శ్రీ సిద్ధి వినాయక వల్లంపూడి వారికి,4వ బహుమతి రూ.6 వేలు బెహరా నాగేశ్వరరావు ఆర్థిక సహాయంతో ఏడుపాక సత్తిబాబు వల్లంపూడి వారికి, 5వ బహుమతి రూ. 4వేలు బర్నికాన చినబాబు ఆర్థిక సహాయంతో మురుకుర్తి అదాకృష్ణ చుక్కపల్లి వారికి, 6వ బహుమతి రూ.3వేలు మువ్వల రాము జ్ఞాపకార్థం వారి కుమారులు ఆర్థిక సహాయంతో బందారు చరణ్ హర్ష కేఎల్బిపురం వారికి,7వ బహుమతి రూ.2వేలు గోకేడ సంతోష్ ఆర్థిక సహాయంతో లెక్కల సూర్యనారాయణ మామిడిపల్లి వారికి, 8వ బహుమతి రూ. 1500లు కీర్తిశేషులు పాటూరు ముసల్నాయుడు ఆర్థిక సహాయంతో పంచాద వెంకటరావు మామిడిపల్లి వారికి,9వ బహుమతి రూ. 1వెయ్యి కొటాన నాయుదు ఆర్థిక సహాయంతో జై వీరాంజనేయ దేవరాపల్లి బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంను శానాపతి అప్పారావు, కోటాన అప్పలనాయుడు, కోటాన అర్జునరావు శ్రీకృష్ణ యువజన సంఘం సభ్యులు గ్రామ ప్రజలు పర్యవేక్షణలో నిర్వహించారు.

ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలి

విశాలాంధ్ర - గంట్యాడ: గడిచిన మే నెల 19,20 తేదీలలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక చర్చల సందర్భంగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ సమక్షంలో సంఘాల అభ్యర్థన మేరకు మ్యాన్యువల్ విధానంలోనే బదిలీలు చేపడతామని మరియు అందుకు అంగీకరించడం కూడా జరిగినది కానీ ఆరవ తేదీ రాత్రి సదరు నిర్ణయాన్ని వెబ్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీలను నిర్వహించే నిర్ణయము ఇచ్చిన హామీని ఉల్లంఘించడమే. అంతేకాక ఇప్పటివరకు వెబ్ కౌన్సిలింగ్ ద్వారా జరిగిన బదిలీలలో కొందరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు కొందరు పాఠశాల సహాయకులకు సాంకేతిక పరమైన సమస్యలు కారణంగా నష్టపోవడం జరిగినది సాంకేతిక సమస్యల కారణంగా నష్టపోయిన ఆ ఉపాధ్యాయులకు తిరిగి కౌన్సిలింగ్ నిర్వహించి న్యాయం చేయవలసిన అవసరం ఉన్నది. అందువలన ఇచ్చిన హామీ మేరకు తక్షణం విద్యాశాఖ కార్యదర్శి మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు చేపట్టాలి క్లస్టర్ లెవెల్ అకాడమిక్ టీచర్ల ఖాళీలను మొదట ఆప్షన్ లో జనరేట్ చేసే ముందు సదరు ఖాళీలను తొలగించడంతో చాలామంది సుదూర ప్రాంతాలకు బదిలీ కావలసి వచ్చింది అట్టి ఉపాధ్యాయుల ఖాళీలతో కలిపి ముందుగా ఇచ్చిన ఆప్షన్స్ మేరకు బదిలీ ఉత్తర్వులు విడుదల చేయాలి చాలామంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు చేసుకున్నారు అట్టి ఉపాధ్యాయులకు ముందుగా ఇచ్చిన ఆప్షన్స్ సరిచేసి బదిలీలు చేయుటకు అవకాశం కల్పించాలి. తుది సీనియారిటీ జాబితాలు విడుదల చేయకుండా మరియు ఉపాధ్యాయులు గ్రీవెన్స్ పరిష్కారం కాకుండానే ఆప్షన్స్ పెట్టుకోవాలని ఒత్తిడి చేయడంతో చాలామంది ఉపాధ్యాయులు నష్టపోవడం జరిగింది అందువల్ల రాష్ట్రవ్యాప్తంగా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి. ఈ సమస్యలపై ఉపాధ్యాయుల ఐక్యవేదిక గంట్యాడ మండల విద్యాశాఖ వినతి ంచారు పత్రము సమర్పించారు. ఈ నిరసన కార్యక్రమంలో గంట్యాడ మండల ఐక్య ఉపాధ్యాయ సంఘాల నాయకులు జేఆర్సి పట్నాయక్ బి శివప్రసాద్ సిహెచ్ తిరుపతి నాయుడు ఆర్ రామకృష్ణ జె సత్యనారాయణ పి నారాయణ రావు జి రమణ జి మురళి మోహన్ ఎస్ గోపాల్ రావు వి వెంకటరమణ కే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలిప్పిస్తామంటూ లక్షలు వసూలు..

ఫోన్ స్టేటస్ ఆధారంగా ఉద్యోగాలకు ఎర

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: మీరెప్పుడైనా రాష్ట్ర సచివాలయంలో అడుగుపెట్టారా పోనీ అక్కడ ఉద్యోగం వస్తే వద్దంటారా ఈ ఆశలన్నీ కల్పించి ఉద్యోగాలకై ఎదురు చూస్తున్న పలువురికి ఫోన్ స్టేటస్ ద్వారా ఆశ కల్పించి ఒకటి కాదు రెండు పదికాదు ఇరవై కాదుఏకంగా యాభై లక్షలు వసూలు చేసిన ముఠాను విజయనగరం వన్ టౌన్ సీఐ శ్రీనివాస్,ఎస్ఐ ప్రసన్న కుమార్ లు పట్టుకున్నారు.ఇందుకు సంబంధించి విజయనగరం డీఎస్పీ శ్రీనివాస్ ,వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం ధర్మవరానికి చెందిన వినోద్ పిర్యాదు మేరకు తీగలాగిన వన్ టౌన్ పోలీసులు మొత్తం డొంకనే పట్టుకున్నారన్నారు. హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, జంగారెడ్డి గూడెం,విజయనగరం జిల్లాల నుంచీ ఉద్యోగాలకై ఎదురు చూస్తున్న ఆరుగురి నుంచీ ఒక్కొక్కొరి నుంచీ అయిదు నుంచీ ఎనిమిది లక్షల వరకు డబ్బులు వసూలు చేసి న గ్యాంగ్.ఫేక్ కంపెనీ అపాయింట్ మెంట్ లెటర్లు,ఐడీ కార్డులు ఇప్పించారన్నారు.అలాగే రాష్ట్ర సచివాలయం వెలగపూడికి తీసుకెళ్లి ఆ గ్యాంగ్ లో ముఖ్యమైన వ్యక్తి సుజిత్ తనకు అందరూ పరిచయమే నంటూ అక్కడే వారం రోజుల ఉంచి భోజనాలు పెట్టించి మరీ కంపెనీ అపాయింట్ మెంట్ లెటర్స్ ఇప్పిండచంతో ఇక ఉద్యోగాలు వచ్చేసాయని వాళ్లంతా ధీమాగా ఉన్నారని.తీరా అపాయింట్ మెంట్ లో ఉన్న అడ్రస్ ను సంప్రదిస్తే...డబ్బులిచ్చిన వాళ్లని వెక్కిరడచంతో లబోదిబో మంటూ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు ముఠాలో విజయనగరంకు చెందిన మహేష్,జంగారెడ్డి గూడెం కు చెందిన రుబీన్,ఏలూరుకుచెందిన జాన్,యాకుబ్ లను అరెస్ట్ చేసామని డీఎస్పీ శ్రీనివాస్ చెప్పారు. ప్రధాన నిందితుడువిజయనగరం ప్రదీప్ నగర్ కు చెందిన సుజీత్ ప్రస్తుతం హాస్పటల్ లో చికిత్స పొందుతున్నాడన్నారు.

నేడు రోబోటిక్ శస్త్ర చికిత్సపై అవగాహన

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఆధునిక వైద్యరంగంలో రోబోటిక్ శస్త్ర చికిత్సలు అనే అంశంపై తిరుమల మెడికవర్ ఆసుపత్రి విజయనగరంలో ఈనెల 8న ఆదివారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ కె.తిరుమల ప్రసాద్ వెల్లడించారు. ఈ మేరకు శనివారం తిరుమల మెడికవర్ ఆసుపత్రి లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సదస్సును స్థానిక ఎమ్మెల్యే వుసపాటి అదితి జయలక్ష్మి గజపతి రాజు ప్రారంభిస్తారని తెలిపారు. ఎ.పి. మెడికల్ కౌన్సిల్, చైర్మన్ డాక్టర్ డి.శ్రీహరిరావు, డాక్టర్ డి.వి.ఎస్.ఎల్. నరసింహం (ఎంఎస్) - డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, డాక్టర్ జి.భాస్కర్‌రావు చైర్మన్, జీఎస్ఎల్ గ్రూప్ ఆఫ్ ఇన్ స్టిట్యూషన్స్, డాక్టర్ కె.పద్మ లీలా ప్రిన్సిపాల్, గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, డాక్టర్ ఎస్. అప్పల నాయుడు, జీజీహెచ్ సూపరింటెండెంట్, డాక్టర్ వి.ఎస్.ప్రసాద్, డాక్టర్ జె.సి. నాయుడు, డాక్టర్ వీ. గోవర్ధన్ రెడ్డి- చైర్మన్, ఏపీ ఏఎస్ఐ, డా ఎఎ ఫణి మహేష్ రెడ్డి సెక్రటరీ, , డాక్టర్ శ్రీకాంత్ , డాక్టర్ మగన్ మెహ్రోత్రా, డాక్టర్ లీనా మెహ్రోత్రా హాజరవుతారని చెప్పారు. రోబోటిక్ సర్జరీ అనేది ఆధునిక శస్త్రచికిత్సా విధానమని, ఇందులో అధిక ఖచ్చితత్వం, నియంత్రణ, సౌకర్యం కలుగుతుందని వివరించారు. ఈ విధానంలో కంప్యూటర్ కంట్రోల్ ద్వారా రోబోటిక్ హ్యాండ్లు నియంత్రించి, శస్త్రచికిత్సా పరికరాలను ఉపయోగిస్తారని, దీనివల్ల తక్కువ నొప్పి, తక్కువ రక్తస్రావం, రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. వైద్య నిపుణులు, విద్యార్థులు, ప్రజానికం ఈ సదస్సుకు హాజరై ప్రయోజనాలను తెలుసుకోవాలని డాక్టర్ తిరుమల ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సెంటర్ హెడ్ ఎన్.మల్లిఖార్జునరెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.అఖిల్ పాల్గొన్నారు.

జూన్ 12న అంతటా పండగ వాతావరణమే...

జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మజ్జి గణపతి

విశాలాంధ్ర - వంగర: ఈ నెల 12న ఏపీలో మామూలుగా ఉండదని, అంతటా పండగ వాతావరణం నెలకొంటుందని విజయనగరం జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రాజాం నియోజక వర్గ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు మజ్జి గణపతి, టీడీపీ సీయర్ నాయకులు మాజీ సర్పంచ్ జి.కె నాయుడు అన్నారు. శనివారం వంగరలో ఆయన మీడియాతో మాట్లాడుతూ జూన్ 12న ఏపీలో కూటమి సర్కారు పాలనకు ఏడాది పూర్తి అయి కూటమి పాలన రెండో ఏడాదిలోకి అడుగు పెట్టబోతోందనీ ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బారీ ఎత్తున కార్యక్రమాలు నిర్వహించాలని స్వయంగా సీఎం నారా చంద్రబాబు నాయుడు తీర్మానించారని ఆయన వెల్లడించారు. జూన్ 12న ఏపీలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నామన్నారు. ఈ పనులు ఏదో ఒక నియోజకవర్గానికో, ఒక మండలానికో, ఒక గ్రామానికో సంబంధించినవి కాకుండా దాదాపుగా అన్ని ప్రాంతాలకు సంబంధించిన పనులు ఉండేలా ప్లాన్ చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే ఏకంగా రూ.9.5 లక్షల కోట్ల మేర పెట్టుబడులను కూటమి నేతలు సాధించామన్నారు. ఏడాది పాలనను కూడా చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించాలన్నారు.

విశాఖ రైల్వే జోన్‌కు జీఎం నియామకంపై ఎంపీ హర్షం

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు సమర్థతతో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎంపీల కృషితో ఎన్డీఏ కూటమి నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ఆశీస్సులతో సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ విశాఖపట్నం రైల్వే జోన్‌కు జనరల్ మేనేజర్‌ను నియమిస్తూ భారత రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేయటంపై హర్షం వ్యక్తం చేశారు. అభివృద్ధిలో భాగంగా ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాలు కల నెరవేరుతున్న సందర్భంగా పత్రికా ముఖంగా రాష్ట్రపతి భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే ముఖ్యమంత్రి ఉత్తరాంధ్ర అభివృద్ధి నేపథ్యంలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు అవసరమగు భూ సేకరణ చేయమని ఉత్తరాంధ్ర జిల్లాల ప్రభుత్వ ఉన్నత అధికారులకు, ఉత్తరాంధ్ర ప్రజా ప్రతినిధులకు సీఎం సూచనలు ఇవ్వడం ఉత్తరాంధ్ర అభివృద్ధికి శుభసూచకమని తెలియజేశారు. సీఎం నవ్యాంధ్ర ప్రగతికి ఎనలేని కృషి చేస్తూ ఉంటే, గత పాలకులు ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు చేయడం తగదని జగన్ రెడ్డి చేసిన వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ ప్యాలెస్ గదుల్లో నుండి బయటకు వచ్చి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి సహకరించాలని కోరుతూ, ప్రభుత్వ విధానాలపై జగన్ రెడ్డి అండ్ టీం చేస్తున్న చర్యలను పత్రికా ముఖంగా ఎద్దేవా చేశారు. ఈ విజయనగరం జిల్లా టిడిపి పార్టీ ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు, విజయనగరం టౌన్ పార్టీ అధ్యక్షులు ప్రసాద్, విజయనగరం నియోజకవర్గం ఏఎంసి చైర్మన్ కర్రోతు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

విశాలాంధ్ర -విజయనగరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు క్రీడల్లో కల్పిస్తున్న అవకాశాలపై అవగాహన కల్పించేందుకు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో చేపట్టిన పారా "స్పోర్ట్స్ చైతన్య యాత్ర" రెండవ రోజు విజయనగరం చేరుకుంది. ఈ సందర్భంగా రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలు శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చైతన్య యాత్రకు సంభందించిన పోస్టర్స్ ను శనివారం తన క్యాంపు కార్యాలయలో మీడియాకు విడుదల చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు అండగా ఉందని అన్నారు. ఇటీవల తీసుకువచ్చిన జి. ఓ. నంబర్ 4 ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల నియామాకాల్లో 3 శాతం ఉద్యోగాలను ఎటువంటి రాత పరీక్ష లేకుండానే వారి విద్యార్హతను బట్టి పారా క్రీడలు ఆడే దివ్యాంగులకు కల్పించడం అద్భుతమైన అవకాశమని అన్నారు. అంతేకాకుండా పారా ఒలింపిక్స్, పారా ఆసియన్ గేమ్స్ లో పతకాలు సాధించే పారా క్రీడాకారులకు కోట్లాది రూపాయిలు ప్రోత్సాహం అందజేస్తున్నామని అన్నారు. అలాగే విశాఖపట్నంలో 22 ఎకరాల్లో పారా క్రీడాకారుల కోసం అత్యాధునిక స్టేడియం నిర్మించబోతున్నామని అన్నారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు రాష్ట్రములో వున్న దివ్యాంగులంతా పారా క్రీడలు ఆడేందుకు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. జిల్లాలో జరిగే ఈ కార్యక్రమానికి రోటరీ గవర్నర్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు తోడ్పాటు అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ గవర్నర్ డాక్టర్. ఎం. వెంకటేశ్వరరావు, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వి. రామస్వామి, విజయనగరం జిల్లా గౌరవ అధ్యక్షులు కె.దయానంద్, విశాఖపట్నం గౌరవ అధ్యక్షులు డాక్టర్. శీతల్ మదాన్, ట్రైన్ ట్రస్ట్ కో ఆర్డినేటర్ సురేష్, పారా నేషనల్ స్విమ్మర్ రవి కుమార్, పారా ఇంటర్నేషనల్ మెడలిస్ట్ శివగంగా తదితరులు పాల్గొన్నారు.

సాంబరాజు కుటుంబాన్ని పరామర్శించిన జెడ్పీ చైర్మన్

విశాలాంధ్ర - గుర్ల: మండలంలోని కెల్లలో టీడీపీ నేత కెల్ల సాంబరాజు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పరామర్శించారు. సాంబరాజు కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఎంపిపి ప్రతినిధి,మండల పార్టీ అధ్యక్షుడు పొట్నూరు సన్యాసి నాయుడు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కెవి సూర్యనారాయణ రాజు, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వరదా ఈశ్వరరావు, బెల్లాన బంగారునాయుడు, బోల్ల సుబ్రమణ్యం, తోట తిరుపతిరావు ఉన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఉప్పలపాటి రాజేష్ వర్మ సమక్షంలో జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర నాయకులు విజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ 11 సంవత్సరాలు పరిపాలన పూర్తయిన సందర్భంగా దేశంలో బిజెపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి వ్యక్తికి తెలియజేసే విధంగా పనిచేయాలన్నారు. రాబోయే అంతర్జాతీయ యోగ డేలో అందరూ పాల్గొనే విధంగా ప్రయత్నించాలని, వికసిత భారత్ అమృతకాలం సేవ సుపరిపాలన పేదరిక సంక్షేమానికి భారతీయ జనతా పార్టీ ఎప్పుడు కట్టుబడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోటగిరి నారాయణరావు, కుసుమంచి సుబ్బారావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

160 గుండె ఆపరేషన్లు చేసిన వైష్ణవ్ హార్ట్ కేర్ సెంటర్ వైద్యులు

అభినందనలు తెలిపిన హాస్పిటల్ ఎండి డాక్టర్ చిట్టి రమణారావు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: పట్టణంలో వెంకటరమణ హాస్పిటల్లో ఉన్న వైష్ణవ్ హార్ట్ కేర్ సెంటర్‌లో కార్డియలజీ డాక్టర్ ఆదిత్య నృశేన్, డాక్టర్ గౌరీ శంకర్ రెడ్డి, డాక్టర్ సూజిత్ కుమార్, డాక్టర్ మహేష్ మత్తు వైద్యులు సారధ్యంలో మే నెలలో విజయవంతంగా 100శాతం సక్సెస్‌తో 160ఆపరేషన్లు చేయడం జరిగింది. అన్ని సర్జరీలను వైష్ణవ్ పేరు మీదగా జిల్లాలో ఉండే పేద మధ్యతరగతి బడుగు బలహీన ప్రాంతాలు ప్రజలకు తక్కువ ఖర్చుతో ఆరోగ్యశ్రీ బీమా ద్వారా గుండె మరియు శాస్త్ర చికిత్స కంటి ఆపరేషన్‌లు అందుబాటులోకీ తీసుకోని వచ్చి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిచడంలో మాకు సహకారం చేస్తున్న వైద్యులకు హాస్పిటల్ సిబ్బందికీ అభినందనలు అని డాక్టర్ చిట్టి రమణారావు అన్నారు. ఈ సభలో మార్కెటింగ్ మేనేజర్ పిళ్ళా హరీష్, కాతలాబ్ ఇంచార్జ్ సత్యనారాయణ, హాస్పిటల్ సిబ్బంది సీతారామ్, అప్పలనాయుడు, కృష్ణ,సాగర్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథం కుటుంబానికి డా. రాజేశ్ పరామర్శ

విశాలాంధ్ర - రాజాం: రాజాం టౌన్ మెంతిపేట ఎస్సీ కాలనీలో ఇటీవల రేషన్ బియ్యం కోసం వెళ్తూ రోడ్ యాక్సిడెంట్‌లో మరణించిన రాగోలు విశ్వనాథం కుటుంబాన్ని రాజాం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జి డాక్టర్ తలే రాజేష్ పరామర్శించారు. కార్యక్రమంలో రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, టౌన్ వైసీపీ నాయకులు ఆశపు సూర్యం, సుదర్శన్‌రావు మాస్టర్, డా. బి.నరేంద్ర, సలాధి సతీష్, అప్పన్న, మనోహర్, జగదీష్, రంజిత్, సింహాచలం, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఆరోగ్యం

విశాలాంధ్ర - విజయనగరం: మానసిక ఒత్తిడిని తగ్గించి ఉల్లాసంగా ఉంచే చక్కటి ప్రక్రియ యోగా అని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం దాసన్నపేట రైతు బజార్ వద్ద యోగాసనాలు వేసే కార్యక్రమం జరిగింది. ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఇందుమతి అందరిచే యోగాసనాలు చేసే విధానాలను తెలియపరిచారు. అనంతరం ర్యాలీని చేపట్టి యోగాంధ్ర విశిష్టతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమీషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ యోగాంధ్ర 2025 వల్ల ప్రజలందరికీ యోగా యొక్క ప్రాధాన్యత తెలియజేసే వీలుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగ పట్ల చైతన్యవంతులై ప్రతిరోజు యోగాసనాలు వేయడం ద్వారా మానసిక ఒత్తిడి తగ్గి ఉల్లాసంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, నగరపాలక సంస్థ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఎస్.జి.టిలకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలి

విశాలాంధ్ర - శృంగవరపుకోట: ఎస్.జి.టి లకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శనివారం పట్టణంలో ఎంఆర్సి వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి అనంతరం ఎంఈఓ కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. సోమవారం జిల్లాలోని డీఈఓ ఆఫీస్ ముట్టడి కార్యక్రమంలో పెద్ద ఎత్తున మన మండలం నుంచి ఉపాధ్యాయుల హాజరయ్యి ముట్టడి కార్యక్రమమును జయప్రదం చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఈ సందర్భంగా కోరారు.

రాజాం తహశీల్దార్‌గా రాజశేఖర్ బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర - రాజాం; రాజాం మండల తహసీల్దార్ గా ఎం. రాజశేఖర్ నియమితులయ్యారు. శ్రీకాకుళం కలెక్టరేట్లో సూపరిండెంట్ గా విధులు నిర్వర్తిస్తున్న ఈయన రాజాం తాసిల్దార్ గా బదిలీపై వచ్చారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ ఎస్. కృష్ణంరాజు జామి మండలం బదిలీ పై వెళ్ళారు. రాజాంలో తహసీల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన రాజశేఖర్ కు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ప్రమాదానికి గురైన అలజంగి ఆచారిని ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర - బొబ్బిలి : మండలం అలజంగి గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు అలజంగి ఆచారి నిర్మాణ కార్మికుడు పని నిమిత్తం బైక్ పై బాడంగి మీదుగా రామభద్రపురం వెళు న్న సమయంలో రామభద్రపురం జగనన్న కాలనీ దగ్గర్లో రోడ్డు మధ్యలో ఉన్న గొయ్యిలో పడి తలకు తీవ్రమైన గాయం వలన నరాలు చిట్లి బ్లడ్ బ్రెయిన్ లో క్లాటు వలన స్పృహలో లేదు కుడి భుజం ఎముకలు చిదిగిపోయాయి. బాడంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ప్రాథమిక వైద్యం జరిపి విశాఖపట్నం కెజిహెచ్ కు తరలించారు. ఆయనకు ఆడపిల్లలు ఇద్దరు. చాలా పేదవాళ్లు తాపీ పని చేస్తేనే జీవ జీవనం. రోడ్లు భవనాల శాఖ నిర్లక్ష్యం వలన ఒక కుటుంబం రోడ్డున పడిందని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకర్రావు అన్నారు. ప్రభుత్వాల విధానాల వలన భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు ప్రభుత్వాలు నిర్వీర్యం చేశాయి. ఆ బోర్డు గాని పనిచేస్తే ఈ ప్రమాదానికి గురైన కార్మికుడికి బోర్డు నుండి సహకారం వచ్చేది. అని అన్నారు. భాదితుడిని అందుకోవడానికి ప్రభుత్వం, దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించడానికి ముందుకు వచ్చి అలజంగి ఆచార్య చిన్న పాప గౌతమి ఫోన్ పే నెంబర్. 7780623626 కు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.